# ముమూర్ష

ఆదివారం, ఉదయం ఆరు గంటలు

నిన్న చచ్చి ఇవాళ పుట్టాను. పునర్జన్మఅంటే ఇదేకాబోలు. వచ్చేకలలే స్వర్గ నరకాలు కాబోలు. నిద్రలో ఈ 'నేను' ఎక్కడికి వెళ్ళింది? చావంటే దీర్ఘనిద్రా?...

నిన్ననే ఉద్యోగానికి రిజైను చేశాను.

'నీతి న్యాయం అనేవాడికి నీకుద్యోగం ఎందుకు? అలా ఏడవబట్టే అయిదేళ్ళ బట్టి నీ సీటు మారలేదు' అన్నాడు ఇంజనీరు.

వాడు రికమెండ్ చేసిన బిల్లు పాస్ చెయ్యలేదు.

రాజీనామా కాగితం వాడి ముఖాన విసిరి బయటకు వచ్చాను.

నాకు ఇంకేం బంధాలులేవు. పడిపోతున్న యీ మేడమీద గదితప్ప! ఇంటి ముసిలిది పాలమనిషిమీదకాబోలు కేకలేస్తూంది. అదిచ్చే నీళ్ళకు ఇదిచ్చేడబ్బుకు చెల్లు.

'RAJA RAO SICK START IMMEDIATELY'

టెలిగ్రాం వచ్చి అరగంటయింది.

ఈ పాటికి వాడు చచ్చి ఉండవచ్చు.

ఇప్పటికి ముప్పదిఐదు సంవత్సరాలు నిండాయి. బ్రతుకు మీద రోతతో రోజూ బ్రతికేస్తున్నాను. రాజారావు చచ్చిపోతే అదృష్టవంతుడు. గోడమీద సాలెగూడు. దాంట్లో ఈగ గిలగిలా కొట్టుకుంటున్నాది. దానికి విముక్తి ఎప్పుడో?...

వీధిలోకి బయలుదేరాను. ఇంటిదానికి ఎవరు చెప్పారో? అప్పుడే "ఇవాళ సాయంత్రం అద్దె ఇచ్చెయి నాయినా"అంది. దానికి యెనభై ఏళ్ళు. ఎవరూలేరు. ఈ డబ్బంతా ఏంచేస్తుందో. జన్మలో సుఖపడి ఉండదది.

వీధిలో ఒంటరిగా నడుస్తున్నాను. ఆఫీసులో పనిచేస్తున్నప్పుడు చాలామందికి నా అవసరం ఉండేది. ఇవాళ అదీలేదు. నాకింకెవరితోను సంబంధంలేదు. ఇంటి దానితో తప్ప.

పేవ్‌మెంట్‌మీద ముష్టిది పిల్లలను పడుకోబెట్టింది. వాళ్ళు అప్పుడే బురద లోంచి వచ్చిన పందిపిల్లల్లాఉన్నారు. దానికి జాకెట్టులేదు. ఏవో గుడ్డపీలికలుఉన్నట్టున్నాయి. అవీ దాని ఒంటిరంగుతో కలిసిపోయాయి. దానికి ఒక కాలుమీద పైచర్మం లేదు. ఎర్రగావున్న ఆ కాలుమీద ఈగలు వాల్తున్నాయి. దానికి ఓచెయ్యిలేదు. రెండో కాలునిండా కురుపులే! అదిచస్తే ఎవరూ విచారించరేమో. అదిచస్తేనే బ్రతుకుతుంది. బ్రతుకంటే ఇంకా ఎందుకో అంతఆశ దానికి! దాన్నిచూస్తే వారంరోజులక్రింద తిన్న తిండికూడా వాంతి అవుతుందని చెప్పడానికి సందేహించక్కర్లేదు.

కోమల విలాస్‌లో మెస్‌లోకిపోయి ఒకమూల బెంచీమీద కూర్చున్నాను. నల్లగా మాసిన గోడలు, సర్వర్ బాగా వేడిగావున్న టీ తెచ్చి బల్లమీద పెట్టాడు. టీగ్లాసు ఒక ప్రక్క పట్టుకున్నాను. రెండవప్రక్కనుంచిచూస్తే నావేళ్లు కనబడుతున్నాయి! ముందు గదిలో చూశాను. కాలేజీ అమ్మాయిలు కాబోలు నలుగురు టిఫిన్ చేస్తున్నారు. అందులో యిద్దరు బట్టలు ఎందుకు కట్టుకున్నారో తెలీదు! రోడ్డుమీద ముష్టిది లేకకట్టుకోలేదు. వీళ్ళకు వుండి ఏంఖర్మ? స్లీవ్‌లెస్ జాకెట్టు అమ్మాయి చెయ్యెత్తి ఏవో చూపిస్తున్నది తక్కినవాళ్ళకు. వాంతివచ్చినంతపనైంది. ఎర్ర చీర అమ్మాయి ఏదో ఆలోచిస్తున్నది. చేతిలో ఉత్తరం ఉంది. బహుశా స్నేహితుడు ఎవరో రాసివుండవచ్చు. ఇంటిదగ్గరనుంచి వచ్చిందేమో, వాళ్ళింట్లో ఎవరికేనా జబ్బుగా ఉందేమో, వాళ్ళనాయినమ్మ, తాతో ఎవరైనా చచ్చిపోయారేమో? నాలుగోఅమ్మాయి నల్ల చీర, నల్లజాకట్టు కట్టుకొనిఉంది. చేతిలో 'The woman of Rome' మొరోవియాది కాబోలు ఉంది. సెంటు బాగా రాసింది. బహుశా మెన్సెస్ అయిందేమో? వాళ్ళ ఏ ఒక్కరిలోనూ ఆనందం వున్నట్టు కనిపించదు? వయస్సులు మహావుంటే 22కి మించవు. మరో ఏడాది రెండేళ్ళలో పెళ్ళిచేసుకొని పిల్లల్ని కంటారు. వాళ్ళకు కొద్దిదూరంలో ముగ్గురు కాలేజీ అబ్బాయిలు కాబోలు కూర్చున్నారు. ఈగపడ్డ కాఫీ యిచ్చాడని సర్వర్‌మీద కేకలు వేస్తున్నాడు వాళ్ళలో ఒకడు. అబద్ధం...వాడేఈగనుపట్టి చంపి కాఫీలో వేశాడు. బహుశా ఈ అమ్మాయిలు వాళ్ళప్రక్క చూడాలని కాబోలు. ముక్కోణం బూటులో అతని పాదాలు నలిగిపోతున్నాయి. ఇరుకు పాంటులో కాళ్లు ఇరుక్కున్నాయి. ఒంటిని చొక్కా సున్నంవేసినట్టు అంటుకొనిఉంది. అతని జన్మంతా తలలో ఉంగరాలు తిప్పడంతో సరిపోతుంది కాబోలు. వాళ్ళచేతుల్లో ఏవో పుస్తకాలు ఉన్నాయి. 'ఇవాళ లెక్చరర్ ఎపాలజీ యివ్వకపోతే స్ట్రైయిక్ తప్పదు' అంటున్నాడు టీషర్ట్‌వాలా. 'ఆఫీసు రికార్డులు తగలపెట్టాలి' అన్నాడు ఉంగరాలు. వాళ్ళను వాళ్లు తగలేసుకోకూడదా? వాళ్ళలో ఎందుకింత అశాంతి?—

టీ తాగడం అయింది. వీథిలోకి వచ్చాను కొద్దిగా మబ్బుపట్టింది. ఆదివారం కావడంచేత దుకాణాలు ఏవీలేవు. జోడుతెగింది. తోడు ఎవరూలేరు. రాజమ్మపోయి ఎనిమిదేళ్ళయింది. అదృష్టవంతురాలు. చొక్కాపిన్నుతీసి జోడుకుట్టాను. చిన్న సందులోకి మళ్ళాను. అందులోంచి మరోసందు, ఎన్నో మలుపులు—

మేడమీద కిటికీలోంచి చూస్తున్న అమ్మాయి బావుంది!

లైబ్రరీకి వెళ్ళాను. గడ్డపాయిన లావాటి జాతకాల పుస్తకంలో లీనంఅయిపోయాడు. నిన్నటి బాధ, ఇవాళ సంగతీ అక్కర్లేదు. రేపటి మీద ఆశతో బతికేస్తాడు. వాంటెడ్ కాలంలోంచి ఏదో రాసేస్తున్నాడు నిరుద్యోగి కాబోలు ?

పేపరు తీశాను 'గుంటూరులో కారు ప్రమాదం, భార్యా పిల్లలను పోషించలేక మురుగన్ అనే అతను విషంపెట్టి చంపాడు మద్రాసులో, హైద్రాబాదులో పోలీసు ఫైరింగ్ ఇరవై మంది విద్యార్థుల మృతి.'

విసురుగా పేపర్ పడేశాను.

ఏదో పుస్తకంతీశాను. ఎవరో ఈవిడ? నలభై కిపైగా నవలలు రాసింది! నాలుగయిదు సినిమాలకు మాటలు రాసింది. పేజీలు తిరిగేస్తున్నాను.

వైర్‌లెస్ తీగెలమీద పిట్టలను చూస్తూ నిలబడింది రాధ. అప్పుడే పోర్టికోలో కారాగింది. శేఖర్ 'రాధా' అంటూ మేడమీదకు వచ్చాడు 'ఈ ముఖమల్ జాకట్టు. షెర్లిన్ సారీమీద రంభలా ఉన్నావ్' అన్నాడు శేఖర్. రాధ ముఖం వెయ్యి వోల్టుల బల్బులా వెలిగింది."

ఇంత దరిద్రంలోకూడా ఈవిడ కారులలో, మేడలలో బతికేస్తూంది! ఏం రాస్తున్నదో తెలీదు. పాఠకులను ఎందుకిలా చిత్రవధ చెయ్యడం? నిజజీవితంలో ఈవిణ్ణి మొగుడు వదిలేశాడట. ఏదో స్కూల్లో టీచర్‌గా పనిచేస్తూంది. పుస్తకం తగలెయ్యాలన్నంత కోపం వచ్చింది. పుస్తకం ఇచ్చేసి ఆలోచిస్తూ కూర్చున్నాను.

Frued Interpretation of Dreams కావాలండీ అని అడుగుతున్నాడు కౌంటరుదగ్గర ఎవరో యువకుడు.

రోజూకనే కలలకు రూపాలు దిద్దుతాడు కాబోలు!

ఐదు నిమిషాలు తక్కువ పదకొండయింది. మరో అయిదు నిమిషాలలో లైబ్రరీ మూసేస్తారు పుస్తకాలు రిటర్న్‌చేసేమంటున్నాడు ఎటెండర్! 'ఈ కథ పూర్తిచేసి యిస్తాను రెండు నిమిషాలాగు' అంటున్నాడు ఓపదహారేళ్ళ బాలాకుమారుడు. అట్టమీద ఆడబొమ్మ లాగు కట్టుకుంటున్నదో విప్పుకుంటున్నదో చెప్పటం కష్టం.

ఒంటిమీద మరేభాగంమీద గుడ్డ పీలికలులేవు. ఆ బొమ్మ చూడగానే అసహ్యం వేసింది. ముష్టిది జ్ఞాపకం వచ్చింది. వీధిలోకి వచ్చేశాను.

మార్కెట్టు జంక్షన్ దగ్గరకు వచ్చాను. పెద్దసినిమా వాల్‌పోష్టర్లు ఎత్తుగా ఉన్న గోడమీద అంటించి ఉన్నాయి. ముసలి సినీతార రొమ్ములు వాల్‌పోష్టరంతా పట్టేలా ఉంది! ఆ రొమ్ములమీద ఒకపిస్టల్ గురి చేయబడిఉంది. దానిని పట్టుకొని పొడవుగా సన్నగాఉన్న హీరోగారున్నారు. వారి ముఖాన పేడ దట్టంగా పులిమి ఉండటంచేత ముఖం కనబడటంలేదు. ఆడతార ముఖాన్న మీసాలు దిద్దిఉన్నాయి. పేడ పురుగుకన్న హీనంగా బతుకుతున్న కాళ్ళను చూసి జాలేసింది. వాల్‌పోష్టర్ చూడగానే కడుపులో త్రిప్పడం మొదలు పెట్టింది.

పొద్దుటినుంచీ ఏం తినలేదు. పన్నెండయింది. కాస్తకాలం గడపడానికి మీల్సు టికట్టు తీసికొని అజంతా హోటల్‌లోకి వెళ్ళాను. కౌంటర్ దగ్గర రేడియోగ్రాం పెద్దగా అరుస్తోంది.

"ము...ము...ముద్దంటే చేదా..." చాలా ఘోరంగా వినిపిస్తూంది, తరువాత ప్లేటు "ఇంద ఇంద తీసికో..." పాడడానికి దానికి సిగ్గులేకపోయినా వినడానికే చాలా అసహ్యంగా ఉంది. బట్టలు ఉన్న మనిషినిచూస్తే అందంగా కనిపిస్తుంది. బట్టలులేని మనిషిని చూస్తే అసహ్యంగా ఉంటుంది. చర్మం కొద్దిగా వలిచిచూస్తే వాంతి వస్తుంది. ముష్టిది జ్ఞాపకం వచ్చింది. దానికి కాలిమీద పైపొరలేదు. అన్నం సయించలేదు. వీధిలోకి వచ్చాను. మున్సిపల్ లారీ పెద్దగా రొద చేసికుంటూ వెళ్ళిపోయింది. కంపు భరించలేకపోయాను. హోటల్‌లో తిన్న భోజనానికి లారీలోఉన్న మలానికి ఎంత తేడా? బతికినవాడికి, చచ్చినవాడికీ ఉన్నంత తేడా. "నేను"అనేది లేకపోగానే మనిషి కుళ్ళి కంపు కొట్టేస్తాడు. అసహ్యం అనిపించింది. కడుపులో వికారంగా ఉంది. ఎందుకు బతుకుతున్నారు జనం ఈ వికారంతో!...

ఆలోచనలు నాకేవస్తాయా? అది సహజమా? ఆలోచించనిదే ఏ పనిచెయ్యకు. ఆలోచిస్తే ఏపనీ చెయ్యలేవు. గోడమీద నిలబడి మేక ఆకులు తింటున్నాది. దానికి ఈ సమస్యలు, బాధలూలేవు కాబోలు. కుక్క ఒకటి ఎంగిలాకుమీద అన్నం తింటున్నాది. ఛీ! ఛీ! ఎందుకిలా బతుకుతారూ! తినకుండా చావకూడదూ!.

అయిదయింది. బీచిలో కూర్చున్నాను. ఒంటరిగా ప్రపంచ సరిహద్దులలో ఉన్నాను. నీటిలో కాళ్ళుపెట్టి పెద్దరాయిమీద కూర్చున్నాను. పిల్లలు కొంత మంది ఇసకలో పిచ్చిక గూళ్ళు కడుతున్నారు. ఎవరో వాటిని ఏంచెయ్యకుండా చూశారు.

ఒక్కసారిగా పిల్లలంతా వాళ్ళు కట్టిన గూళ్ళను వాళ్ళే పడతోసివేశారు కాళ్ళతో. కేకలు వేస్తూ, గోలచేస్తూ వెళ్ళిపోతున్నారు ఇళ్ళకు. ఎంత ఆనందంగా ఉన్నారువాళ్ళు!

వాళ్ళే పెద్దయ్యాక గాలిమేడలు కడతారు అవి కూలిపోతే ఎంతో బాధపడతారు. ప్రతివాడు ఓ పది సంవత్సరాలు బతికి హాయిగా చచ్చిపోకూడదూ! ఇలా జీవితం మీద అసహ్యంతో బతకడం ఎందుకు?

నాకు కొద్దిదూరంలో ఓ అమ్మాయి కూర్చొనిఉంది. ఆమె చాలా అందంగా ఉంది. మాటి మాటికీ వాచీ చూస్తూంది. బహుశా బాయ్‌ఫ్రెండ్ గురించి ఎదురు చూస్తున్నట్టుంది. ఆ అమ్మాయికి తన అందం అంతా కొద్ది కాలమేనని, తరవాత ముసలిదయిపోతుందనీ, పెళ్ళిచేసికొన్నాక లావుగా అసహ్యంగా తయారవుతుందనీ తెలుసో తెలీదో! వెళ్ళి చెప్పాలనిపించింది. తనూ చిన్నప్పుడు బావుండేవాడు. ఎంతో మంది అమ్మాయిలు ప్రేమలేఖలు రాసేవారు, రాజేశ్వరి ఏం చేస్తూందో? రమణి చచ్చిపోయింది.

చావు!

అందరూ చచ్చిపోతున్నారు. రాజారావు ఈ పాటికి చచ్చిఉంటాడు.

పుట్టిన ప్రతీవాడు చస్తాడు. చచ్చిన ప్రతీవాడు బ్రతుకుతాడు.

బతికున్న ప్రతీవాడు ప్రతిక్షణం చస్తున్నాడు.

తలంతా దిమ్ముగాఉంది.

నిర్మలంగా ఉన్న నీటిలో రాయి విసిలేను,

అది నిలకడగాఉన్న నీటిని అలలుగా చేస్తూ చెదరగొట్టింది.

ఒక్కరాయి నిలకడగావున్న నీటిలో అంతరివల్యూషన్ తీసికొచ్చింది!

"నేను" ఈ ప్రపంచంలో ఏదేనా చేసానా?

నిన్నటి వరకూ ఈ "నేను" అనే రాయివాట్టా ఎన్నో అలలు.

ఈ నాడు అనామకుడిని. ఉద్యోగం లేదు. ప్రస్తుతం చీకటిలో సముద్రం ఒడ్డున ఒక్కడినే మిగిలాను. అమ్మాయిని స్కూటర్ మీద తీసికెళ్ళిపోయాడు సూటు వేసికొన్న ఆసామి.

చీకటి వీధిలో ఒక్కడినీ నడుస్తున్నాను. ఎత్తుగాఉన్న అరుగుమీద నల్లటి ఓ ఆకారం తెల్లచీర ఆకారాన్ని ముద్దు పెట్టుకుంటున్నాది. 'రండిబాబూ' అంటూ గారపళ్ళతో పిలుస్తున్నాది ఓ ముసిలిది.

నా చుట్టూ ఉన్నవారికి నా వల్ల జరిగిన ఉపకారం?

నేను లేకపోతే ప్రపంచానికి ఏమైనా నష్టం ఉందా?

ఏమిలేదు, ఏమిలేదు—ఏమిలేదు—

ఇంకా బ్రతకడం ఎందుకు?

ఈ ఎలకలమందు పుచ్చుకుంటే—

రేపు ఉండదు.

ఇంటి ముసలిదే తగలెయ్యాలి.

ఛీ! ఛీ! కుళ్ళి కుళ్ళి ఈ రోగాలతో చచ్చేబదులు ఒక్కసారి చచ్చిపోకూడదూ!

రేపు ఎలా?

ఉద్యోగంలేదు!

తిండిలేదు.

బతకాలన్న ఆశ పూర్తిగా హరించిపోయింది.

చచ్చిపోవడంలోవున్న సుఖం ఎక్కడాలేదు.

రాజారావు చచ్చిపోయుండాలి.

పావలాఇచ్చి ఎలకల మందు కొన్నాను.

ఇవాళ ఇది పుచ్చుకొంటే—

రేపు,

ఈ "నేను" ఎక్కడో?...

కరెంటుకూడా నీకెందుకని ఇంటి ముసలిది తీయించేసింది. కొవ్వొత్తి వెలిగించాను. గదిలో నీడలు చాలా భయంకరంగా ఉన్నాయి. సగం విరిగిన కిటికీలోంచి నక్షత్రాలు కనబడుతున్నాయి. నేలమీద ఓ పక్క చీమలపుట్టవుంది. ఏదో జంతువును చంపి పుట్టలోకి తీసుకువెళ్తున్నాయి. గోడమీద హిరణ్యాక్షుని చంపుతూన్న నరసింహస్వామి బొమ్మవుంది. అది తియ్యమని ముసలిదానికెన్నిసార్లు చెప్పినా తియ్యదు. ఆ బొమ్మను ఏంచేసినా దానికి నరసింహస్వామి కూనుతాడు. ఆ బొమ్మ అక్కడఉండటం ఇష్టంలేకపోతే యిల్లు ఖాళీచేసి వెళ్ల అంటుంది. మనిషి మనశ్శాంతి కోసం దేవుణ్ణి సృష్టించాడు కాబోలు. కాని ఇంత అశాంతి ఏమిటో?

కొవ్వొత్తి మరో అయిదు నిమిషాలకన్నా ఎక్కువ వెలుగదు. ఈముప్పదిఐదు ఏళ్ళలో నేను సాధించినది ఏమిటి?

పొందిన ఆనందం?

అనుభవించిన సుఖం?

తను తగలడితే మిగిలేది బూడిద,

క్షర ఘంటవెడితే బూడిద అవుతుంది.

347

అదే కర్రగావుంటే ఎన్నో ఉపయోగాలు. నానాచిత్రవధలకుగురై కుర్చీగానో. బల్లగానో ఏదో ఓ అకారం ధరిస్తుంది.

పైం చూసాను.
ఐదునిమిషాలు తక్కువ పన్నెండు దగ్గిర వాచీ ఆగిపోయింది.
కొవ్వొత్తి ఆరిపోతున్నాది—ఆరిపోయింది.
వెలుగు ఏమయింది ?
ఇంత సేపు మండిన మంట ఏది ?
చీకటి!
చీకటిలో నేనొక్కడిని.
నాగదిలో మంచంమీద పడుకొని ఆలోచిస్తున్నాను
"ఎలకల మందు తినడమా? వద్దా?"...అని—

—భమిడిపాటి అనంతనారాయణ.

## తప్పుకో!

తిక్కచచ్చిన మనిషీ
నీ సర్వస్వం ధారపోసి
నిండుగా మేపి
అందంగా అలంకరించిన-
నాయకులెందరో
మత్తుగా ఖుషీగా కూర్చున్న రథాన్ని
ఠీవిగా పైకిచూస్తూ
దర్పంగా అడుగులేస్తూ
వేగంగా లాక్కొస్తున్న గుర్రం
నీ బక్కచిక్కిన డొక్కల్లో
ఇనుప డెక్కల ముద్రలేసి
దర్జాగా వెళ్ళిపోతుంది
చూస్తావేం
తప్పుకో!

—మోహన్.

348